సంపుటి : 8 సంచిక : 11
**అమ్మనుడి**
ఫిబ్రవరి 2023

సంపాదక హృదయం

## ఒక భాషాజాతిగా ఎదగడమే మన లక్ష్యం కావాలి

**ఈ** సంచికలోనే 9వ పుటలో 2013 జనవరి 1న 'సాక్షి' పత్రిక సంపాదకీయాన్ని తిరిగి ప్రచురించాము. దచచేసి ముందుగా ఒక్కసారి దానిని చదవండి. 2012 డిసెంబరులో తిరుపతిలో ప్రభుత్వం నిర్వహించిన ప్రపంచతెలుగు మహాసభల్లో ప్రకటించిన తీర్మానాలపై స్పందిస్తూ 'సాక్షి' ఎన్నో అర్థవంతమైన అంశాలను ప్రస్తావించింది. ఆ సభల తర్వాత రాష్ట్రవిభజన జరిగి ఆంధ్ర, తెలంగాణాలు విడిపోయి ఎన్నికలు జరిగిన పర్యవసానంగా 2014 జూన్ నుండీ తెలుగుదేశం పార్టీ అధికారంలోకొచ్చింది. తర్వాత 2019 జూన్‌లో వై.సి.పి. నేత జగన్మోహనరెడ్డిగారు ముఖ్యమంత్రి అయ్యారు. తన పత్రిక సాక్షి సంపాదకీయంలో వ్రాసిన దాన్ని పూర్తిగా విస్మరించి, అందుకు విరుద్ధమైన నిర్ణయాలు తీసుకున్నారు. రాష్ట్రంలో పూర్తిగా తెలుగు నిర్లక్ష్యానికి గురైంది.

తిరుపతి సభల నిర్ణయాల అమలుకై నాటి కాంగ్రెస్ ప్రభుత్వం కొన్ని చర్యల్ని ప్రకటిస్తూ ఉత్తర్వులనిచ్చినా వాటి అమలు కోసం చేసింది నామమాత్రమే. తెలుగుదేశం పార్టీ అధికారంలోకొచ్చిన తర్వాత అంతకుముందటి నిర్లక్ష్యాన్నే కొనసాగించింది. ఉద్యమకారుల వత్తిడి వల్ల కొన్ని ఉపశమన చర్యల్ని ప్రకటించినా, చిత్తశుద్ధి కరవై అవన్నీ కన్నీటి తుడుపుగానే మిగిలిపోయాయి. పరిపాలనలో తెలుగు అమలు అంశంపై ఎన్నోసార్లు మనం ఈ పత్రికలో ప్రకటించుకున్నట్లుగా– తొలుత కాంగ్రెస్ హయాంలో జరిగినదానికంటె, ఎన్టీఆర్ హయాంలో జరిగిన అద్భుత పురోగతిని తర్వాతి పాలకులు నీరుగార్చారు. పీవీ నరసింహారావు గారి పుణ్యమా అని దేశంలోనే గొప్పగా వర్ధిల్లిన తెలుగు మాధ్యమం విషయంలోగానీ, ఒక భాషగా తెలుగును నేర్పే విషయంలోగానీ ప్రభుత్వాలు శ్రద్ధవహించలేదు. ప్రభుత్వ విద్యావిధానం అత్యంత బలహీనస్థితికి చేరుకొంది.

ప్రపంచీకరణ పరిణామాలకు అన్ని స్థాయిల్లో లోనైన పాలకవర్గాలు, స్వాభిమానాన్ని పూర్తిగా కోల్పోయి. అవినీతి పరులైపోయాయి. ఎలాగైనా ఎన్నికల్లో గెలిచి, అధికారంలోకి రావడమే పరమ లక్ష్యంగా సాగిన అధికార, ప్రతిపక్ష పార్టీల ఆలోచనలు, విధానాలు– పైకి ఎన్ని మెరమెచ్చులు పలికినా, పూర్తిగా ప్రజాప్రయోజనాలకు దూరంగా జరిగాయి. అభివృద్ధి, ఆధునికత, అనే ముసుగుల క్రింద ప్రజలను మోసగించడం సాగింది. చివరకు ప్రజలకు పార్టీల పైనా, వాటి నేతలపైనా నమ్మకం పోయింది. ఆశపడటం, మోసపోవడం అలవాటైపోయింది. ఈ అవకాశాన్ని వ్యాపార వర్గాలు సొమ్ముచేసుకొంటున్నాయి. ఇందుకు ఏ రంగమూ మినహాయింపు కాదు. విద్యావ్యాపారం చేసేవారు విజృంభించారు. పాలకవర్గాలనే కొనుగోలు చేయగల స్థితికి చేరుకొన్నారు. చంద్రబాబు గారి ప్రభుత్వమైనా, నేటి ప్రభుత్వమైనా వ్యాపార వర్గాలు వారి నియంత్రణలోనే ఉన్నాయి.

దీని ఫలితంగానే ఇప్పుడు విద్యారంగం పూర్తిగా ఖర్చుతో కూడినదైపోయింది. దానివల్ల బీదలకు ప్రోత్సాహకాల పేరుతో ఓట్ల గాలం రాజకీయాలు ఆకట్టుకున్నాయి తప్ప, విద్యలో నాణ్యత అడుగంటుతున్నది. పాఠశాల స్థాయి పిల్లలు ఇందుకు బలి అవుతున్నారు. తెలుగు ప్రభ ఎలా కోల్పోతున్నది. ఇంగ్లీషు కూడా ఎలా అధోగతికి చేరుతున్నదో తెలిపే పత్రికా వార్తను ఈ ప్రక్కపుటల్లోనే చూడండి.దీనికి చికిత్స ఏమిటి? నాణ్యమైన విద్యకోసం, పేద విద్యార్థులకూ విద్యను అందించడంకోసం ఏం చెయ్యాలి? ఆలోచన పరులంతా ఆందోళన చెందుతున్నారు.

ఇలాంటి పరిస్థితుల్లో– వ్యవస్థల్ని పాలక వర్గాలే భ్రష్టు పట్టిస్తుండగా తెలుగు రాష్ట్రాలు తమ అస్తిత్వానికి

సంపాదక హృదయం

నిదర్శనంగా నిలిచే కీలకమైన అంశాల్ని మరిచిపోతున్నాను. నిస్పృహతో అచేతనస్థితిలోకి వెళ్తున్నారు. భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటులో ఉన్న మహోత్తమ లక్ష్యాలనుండి ప్రజలు దారిమళ్లించబడుతున్నారు. తెలుగు ప్రజలు స్వాభిమానానికి, జాతి పురోగతికై మూలమైన ఆదర్శాలకు విధానాలకు దూరంచేయబడుతున్నారు. కంచే చేనుమేసిన విధంగా తయారైంది తెలుగు రాష్ట్రాల పరిస్థితి. తెలుగు వారి కోసమే తమ పార్టీ ఉందని చెప్పే తెలుగుదేశం పార్టీగానీ, తెలంగాణ ప్రజలకోసమే, భాషా సంస్కృతుల రక్షణకే మా పార్టీ పుట్టిందని చెప్పుకొనే కె.సి.ఆర్. ప్రభుత్వంగాని ఈ రెండు రాష్ట్రాల ప్రాణాధారమైన తెలుగు భాష రక్షణ కోసం వారు చెప్పిన వాటిని పూర్తిగా తుంగలో తొక్కాయి. ఎన్టీఆర్ ప్రకటించిన మాతృభాషా విధానాన్ని చంద్రబాబు త్రోసిరాజన్నారు. తెలంగాణాలో అధికారంలోకొచ్చిన ఎన్టీఆర్ అనుచరుడు కె.సి.ఆర్, హైదరాబాదులో జరిపిన ప్రపంచమహాసభల్లో అద్భుతాలు చేస్తామని ప్రకటించిన తర్వాత పూర్తిగా ముఖం తిప్పేశారు. ఆంధ్రలో అధికారంలో కొచ్చిన వై.ఎస్.ఆర్.పార్టీ ప్రజల్లో అప్పటికే ఏర్పడ్డ నిరాశా, నిస్పృహలను తనకు అనుకూలంగా మార్చుకోవడంలో తెలుగుభాషను కూడా బలిచేయడానికి సిద్ధపడి, ముందుకు సాగుతున్నారు. రెండు రాష్ట్రాల్లో ఇంచుమించుగా తెలుగు విషయంలో ప్రభుత్వాల విధానాలు ఒకే విధంగా ఉన్నాయనక తప్పదు.

ఇలాంటి దశలో తెలుగు నేలమీద పరిస్థితుల్ని ఎలా మెరుగుపరచాలి? ఇదీ మనం ఆలోచించాల్సిన అంశం.

పాలకవర్గాలు, పార్టీలు, ప్రభుత్వాలు ప్రజాస్వామ్యధోరణి నుంచి క్రమంగా దిగజారిపోతున్నాయని మనం గమనిస్తున్నాం. ప్రజలకు పూచీపడాలనే నిబద్ధత నుండి వారు బాగా దూరమైపోతున్నారని ప్రత్యేకించి చెప్పనక్కరలేదు. అది వారికీ తెలుసు.

ఇంకా మనం తెలుగు గొప్పదనాన్ని గురించి పదేపదే చెప్పుకోవలసిన అవసరం లేదు. మానవ సమాజాల్లో వికశించిన తొలి అమ్మనుడులను అన్నిటినీ సమభావంతో చూడడమే మన విధానం. ఇదే శాస్త్రీయమైన చూపు. ఏ భాషాజాతి వారు తమ భాషను వినియోగించుకోరో అది ఎదగదు. భారత దేశంలోని భాషల విషయమైనా అంతే. నేటి సమాజ అవసరాలకు తగ్గట్లుగా- ఆధిపత్య భాషల పోటీని తట్టుకొంటూ, స్వాభిమానంతో తెలివిగా ఒక భాషాజాతిగా ఎదగడమే మన లక్ష్యంకావాలి. మనం ఆంగ్ల భాష ఆధిపత్యాన్నే కాదు, హిందీ, సంస్కృతంతో సహా ఏ భాషా ఆధిపత్యాన్నీ అనుమతించకూడదు. ఇందుకోసం ఏంచేయాలో కార్యాచరణ గురించి మాత్రమే మనం మాట్లాడుకోవాలి. మనం రానున్న ఫిబ్రవరి 21- అంతర్జాతీయ మాతృభాషాదినోత్సవం నుండి మరలా ఇందుకు అంకితం కావాలి.

మాతృభాషల రక్షణకోసం ఇప్పుడు ప్రపంచమంతటా ఉద్యమధోరణిలో ఆలోచన మొదలైంది. మన దేశంలోకూడా కొత్త గాలులు వీస్తున్నాయి. ఇందుకు సంబంధించిన వార్తల్నీ, విశేషాంశాలను ప్రతినెలా ఈ పత్రికలో మీరు చదువుతున్నారు. ఈ సంచికను శ్రద్ధగా చదవండి. ముద్రిత పత్రికగానే గాక, ఇకపై వలగూడు (ఇంటర్నెట్)లోనూ వస్తుంది. సమాచారాన్ని అందిస్తూ మనకొక దారిదీపంగా మరింత శక్తిమంతంగా వస్తుంది. 'అమ్మనుడి' పేరుతో పత్రిక పునర్జన్మ పొందిన తర్వాత, విజయవంతంగా 8 ఏళ్లు పూర్తి చేసుకొని, మార్చినెల నుండి 9వ ఏడులోకి ప్రవేశించబోతున్నది. అందరి సహకారాన్నీ కోరుకొంటున్నాము.

31-01-2023

సామల రమేష్ బాబు